
# సత్యవాక్కు

క్రైస్తవ మాసపత్రిక

THE WORD OF TRUTH



## మీకొక సదవకాశము !

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలు పొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 15 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్య-మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటె ఈ దిగువ చిరునామాకు రూ. 15/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి!!

**SATYA VANI**
(P.O. Box 80) Seshagiri Rao St.
KAKINADA-533 004

గమనిక :- మీరు M.O. పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగినప్పుడు మీ సత్యవాక్య- నంబరును మాకు తెలియ జేయండి. ఇది అత్యవసరం !!

Razan Electric Press, Kakinada.

# సత్యవాక్యం

**THE WORD OF TRUTH**

P.O. Box 80, KAKINADA, A.P 533 001.

Editor : J.C. CHOATE

Managing Editor : JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 12 సెప్టెంబరు 1991 సంచిక 2

## సంపాదకీయము

### పరిశుద్ధాత్మనుగూర్చి నీవేమనుకొంటున్నావో కాని....

"పరిశుద్ధాత్మ"-అని మనం పిలిచే ఆయన లేఖనాల్లో, "యెహోవా ఆత్మ" (యెషయా 11:27; దేవుని ఆత్మ (ఆది 1:2; మత్తయి 12:28); సత్యస్వరూపియగు ఆత్మ (యోహాను 16:13); ఆదరణకర్త (యోహాను 14 : 16) అని కూడా పిలువబడ్డారు. పాతనిబంధన కాలంలో ఆయన ఆయా కార్యాలు జరిగించినట్టు వ్రాయబడియున్నా, వాటిని మనం ఇక్కడ ముచ్చటించుకోబోవడం లేదు. అప్పట్లోనేమి, క్రొత్త నిబంధన ప్రారంభ దినాల్లోనేమి-ఆయన జరిగించిన ఒక పని స్పష్టంగా కన్పిస్తుంది. అదేమంటే-ఉపదేశించడానికి లేక బోధించడానికి కాని, లేఖనాలను వ్రాయించడానికిగాని దేవుని ఏర్పాటులో వున్నవారిని ప్రేరేపించడమే! (2 సమూ 23:2; 2 పేతురు 1:21).

### పరిశుద్ధాత్మ ఎవరు ?

అయితే ఈ పరిశుద్ధాత్మ ఎవరు? వ్యక్తి ఎవరో తెలియకుండా

ఆయన పనిని మనం సరిగా అర్థం చేసికొనడం కష్టంగదా? అయినా పరిశుద్ధాత్మనుగూర్చి జనుల్లో పలురకాలైన అభిప్రాయా లుండటం వల్ల, యింతకు పరిశుద్ధాత్మ ఎవరు? అనే సంగతి అనేకులకు అర్థం కానట్టే తెల్పుస్తుంది.

పరిశుద్ధాత్మ అనే ఆయన, వేరే వ్యక్తి కాడనీ, ఆయనే దేవుడని-కాకపోతే ఆ దేవుడు శరీరధారియైనప్పుడు కుమారుడనబడ్డాడనీ; కుమారుని రూపంలోవున్న ఆ దేవుడే భూమిమీద తన కార్యక్రమాన్ని ముగించుకొని పరలోకానికి వెళ్ళి, మరల తిరిగితానే పరిశుద్ధాత్మగా వచ్చాడనీ- తండ్రి, కుమార పరిశుద్ధాత్మ అనే ఈ ముగ్గురూ వాస్తవానికి ముగ్గురు కాక, ఒకే వ్యక్తి యని; ఆ ఒక్క వ్యక్తే-ఆయాకాలాల్లో ఆయా పనులకొరకు ఆయా రూపాల్లో ప్రత్యక్షమయ్యాడని ఎక్కువమంది నమ్ముతారు. నీ అభిప్రాయం కూడా అదేనా; లేక భిన్నమైనదా!

ఎవరి అభిప్రాయం ఎలాగున్నా, మనం స్వయంగా వ్యక్తిని చూడనివారం, ఎరుగనివారం. గనుక మన అభిప్రాయాలు రైటు కావచ్చు; తప్పుకావచ్చు. అందువలన ఎటూ చెప్పలేం. మనం తెలిసీ తెలియక; ఎరిగీ ఎరుగక, ఏవో మాటలు మాట్లాడుకొంటూ మన అపార్థాలలో స్థిరపడేదానికంటె, వ్యక్తిని బాగుగా ఎరిగిన వారి మాటలు వినడం, వాటిని అంగీకరించడం జ్ఞానయుక్తంగా వుంటుంది; కదా? పరిశుద్ధాత్మను ఎరిగిన వారి మాటలను లక్ష్యముంచుదాం.

ప్రభువైన యేసు కంటె రక్తమాంసాలు ధరించిన మరెవ్వరూ పరిశుద్ధాత్మనుగూర్చి ఎక్కువగా ఎరిగినవారులేరు. అసలు ఆయనే పరిశుద్ధాత్మ అని కదా, కొందరి అభిప్రాయం! అలాంటప్పుడు, ఆయన మాటలే ఆలకించుదాం. ప్రభువు తన అపొస్తలులకు పరిశుద్ధా

త్మను గూర్చియు, ఆయన పనిని గూర్చియు సవిస్తరంగా వివరించారు. దానికి ముందు— "ఆ పండుగలో మహాదినమైన అంత్యదినమున యేసు నిలిచి ఎవడైనను దప్పిగొనిన యెడల నా యొద్దకు వచ్చి దప్పి తీర్చుకొనవలెను. నాయందు విశ్వాసముంచు వాడెవడో లేఖనము చెప్పినట్లు వాని కడుపులోనుండి జీవజలనదులు పారునని బిగ్గరగా చెప్పెను. తనయందు విశ్వాసముంచువారు పొందబోవు ఆత్మనుగూర్చి ఆయన ఈ మాట చెప్పెను. యేసు ఇంకను మహిమ పరచబడలేదు గనుక ఆత్మ ఇంకను అనుగ్రహింపబడి యుండలేదు. (యోహాను 7 : 37-39). అని వ్రాయబడియుంది.

## ఆదరణ కర్త

అయితే ప్రభువు మహిమ పరచబడే కాలం ఆసన్నమయ్యింది. ఆయన అప్పగింపబడబోవు రాత్రి తన అపొస్తలులతో సవిస్తరంగా మాట్లాడి పరిశుద్ధాత్మను వారికి పరిచయంచేశాడు "...నేను మీతో కూడ వుంటిని గనుక మొదటనే వీటిని మీతో చెప్పలేదు. ఇప్పుడు నన్ను పంపిన వాని యొద్దకు వెళ్లుచున్నాను" అంటూ, ప్రభువు వారితో యింకను యిలా అన్నాడు: "నేను ఈ సంగతులు మీతో చెప్పినందున మీ హృదయము దుఃఖముతో నిండియున్నది. అయితే నేను మీతో సత్యం చెప్పుచున్నాను, నేను వెళ్ళిపోవుటవలన మీకు మాకు ప్రయోజనకరము; నేను వెళ్ళని యెడల ఆదరణ కర్త మీ యొద్దకు రాడు; నేను వెళ్ళిన యెడల ఆయనను మీ యొద్దకు పంపుదును. ..." (యోహాను 16 : 5-7).

పరిశుద్ధాత్మ "ఆదరణకర్త" అని తెలిసింది. అయితే ఆయన ఎలాటివాడో తెలియాలి. ఆ విషయాన్ని ప్రభువు వారికి ఆ సమయంలోనే ఖుల్లా వివరించారు. "నేను తండ్రిని వేడుకొందును, మీయొద్ద

ఎల్లప్పుడు నుండుటకై ఆయన (తండ్రి) వేరొక ఆదరణకర్తను అనగా సత్యస్వరూపియగు ఆత్మను మీ కనుగ్రహించును" అని ప్రభువు వారికి వాగ్దానంకూడా చేసారు. పరిశుద్ధాత్మ కేవలం ఆదరణకర్త మాత్రమేకాదు; ఆయన "వేరొక" ఆదరణకర్త!! ప్రభువు మాటలను గమనించావా?

"వేరొక" అనగానే దానిలో రెండు భావాలు ఇమిడియున్నాయి. (1) అది. "ముందు దానివంటి మరియొకటి" కావచ్చు; లేదా (2) ముందు దానికంటె భిన్నమైన మరియొకటి కావచ్చు. ఈ రెండింటిలో ప్రభువు ఏ భావాన్ని ఉద్దేశించారో తెలుగులో చదువుకొంటున్న మనం నిర్ణయించలేముగాని; అపొస్తలులకు ఆ భావం సరిగా అర్థమయ్యింది. యోహాను (8 : 31,32) మాటలే దీనికి రుజువుగా వున్నాయే.

మనకు తెలుగు భాషలో యివి వున్నాయో లేవో నాకు తెలియదు గాని, గ్రీకు భాషలోనైతే "మొదటి దానివంటి మరియొకటి" అని తెలపడానికి **Allos** (ఎల్లోస్) అనే పదం; "మొదటిదానికంటె భిన్నమైన మరియొకటి" అనేదాన్ని సూచించడానికి (హెటెరోస్) **Heteros** అనే మరో పదం వున్నట్టు గ్రీకు పండితుడైన థేయర్ తెలిపాడు **(Theyar's Greek English Lekieon, 243, P. 29** చూ).

"వేరొక" ఆదరణకర్త అని ప్రభువు పరిశుద్ధాత్మను గూర్చి తన అపొస్తలులకు పరిచయం చేసినప్పుడు **Allos** (ఎల్లోస్) అనే భావాన్ని వాడినట్టు బైబిల్లో వ్రాయబడి యుంది (యోహాను 14:16). అంటే ప్రభువు పరిశుద్ధాత్మను గూర్చి ఏమని పరిచయం చేశాడు? పరిశుద్ధాత్మ తన వంటి మరయొకరట! గనుక క్రీస్తు, పరిశుద్ధాత్మ అనే వారిద్దరూ ఒకే వ్యక్తి కారు. **(There is numerical dis-**

tinction rather than qualitative difference between the Lord Jesus and the Holy spirit. They are two in member; but they are not two in quality).

అయినా యిక్కడ ఒక సంగతి మరచిపోకూడదు. అదేమంటే ప్రభువైన యేసు రక్తమాంసాలు ధరించి సశరీరుడుగా ప్రత్యక్షమయ్యారు. అయితే పరిశుద్ధాత్మ భూమిమీదికి వచ్చినపుడు ప్రభువువలె, తానుకూడా సశరీరుడుగా ప్రత్యక్షంకాడు. ఆయన తాను వున్నట్టు, ఆత్మరూపిగానే వస్తారు. రక్తమాంసాల్లో పాలివాడైన క్రీస్తు ప్రభువు, తన అపొస్తలులతో కలసి మాత్రమే మసలుకోగలిగారు కాని; ఆత్మరూపంలోనే భూమిమీదికి పంపబడే పరిశుద్ధాత్మనైతే: ప్రభువుయొక్క అపొస్తలులతో కలసి ఉండడం మాత్రమే కాదు; ఆయన వారిలోను వారితోనూ వుంటారని ప్రభువు వారికి తెలియజేశారు (యోహాను 14:16-17).

అంతేకాదు. తానును, పరిశుద్ధాత్మయు వేరువేరుగా వునికి కలిగిన వ్యక్తులని మనం గుర్తించేలా, ప్రభువైన యేసు యిలా సూచించారు, చూడు. "మనుష్యకుమారునికి విరోధముగా మాటలాడువానికి పాపక్షమాపణ కలదు గాని, పరిశుద్ధాత్మకు విరోధముగా మాటలాడువానికి ఈ యుగమందైనను రాబోవు యుగమందైనను పాపక్షమాపణ లేదు" (మత్తయి 12 : 32). పరిశుద్ధాత్మ "వేరొక" ఆదరణకర్త .అన్న భావాన్ని ప్రభువు ఈ మాటల్లో స్థిరపరచారు. ఇక దాన్ని కాదనదలచుకుంటే, అది నీ యిష్టం.

## పరిశుద్ధాత్మ దేవుడు

అంతేనా ? పరిశుద్ధాత్మ దేవత్వంలో తండ్రితోను క్రీస్తు ప్రభువుతోను ఏకమై, వ్యక్తిగా వేరైయున్నాడంటే నీ వేమంటావో? దీనికి నీవేమన్నా, దేవత్వంలో పరిశుద్ధాత్మ మూడో వ్యక్తిగా

వున్నట్టు లేఖనాలు వివరిస్తున్నాయి. వాటిలో కొన్నింటిని ఈ సందర్భములో చూద్దాం.

(1) ప్రభువైన యేసు బాప్తిస్మం పొంది నీళ్ళలోనుండి ఒడ్డునకు వస్తున్నారు. ఆకాశం తెరువబడింది. పరిశుద్ధాత్మ పావురంవలె దిగి ఆయన మీదికి వచ్చాడు. అప్పుడు పరలోకమందున్న తండ్రి, క్రీస్తునుగూర్చి-ఈయన నా ప్రియకుమారుడంటూ సాక్ష్యమిచ్చాడు (మత్తయి 3:16-17).

2. క్రొత్త నిబంధనలో ప్రవేశించడానికి బాప్తిస్మం పొందేవారు - తండ్రి యొక్కయు కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామంలోనికి బాప్తిస్మం పొందాలి (మత్తయి 28 : 18). ఆదియందు దేవుడు **(Elohim)** భూమి ఆకాశములను సృజించెను **(bara)** అన్న సందర్భంలో **Plural noun, Singular verb** తో అంతమైనట్టు (ఆది 1 : 1); యిక్కడ కూడా తండ్రియొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు అని ముగ్గురు వేర్వేరు వ్యక్తులను సూచించి, నామములోనికి అని ఏకవచనాన్ని ప్రయోగించడంలో, పరిశుద్ధాత్మకు దేవత్వంలోవున్న స్థానం తేటగా సూచింపబడింది.

3. దేవుని అనాది సంకల్పాన్ని ప్రత్యేకంగా చర్చించిన ఎఫెసీ పత్రికలో, దేవత్వం పరిచయం చేయబడింది. అందులో ఆత్మయు ఒక్కడే (ఎఫెసీ 4 : 4); ఆయన పరిశుద్ధాత్మ; ప్రభువు ఒక్కడే (5 వచనం); ఆయన యేసుక్రీస్తు. అందరికి తండ్రియైన దేవుడు ఒక్కడే అని (6వ) అంటూ అక్కడ దేవత్వంలోని **numerical distinction** న్ను సూచించడం జరిగింది.

4. వారు పనిచేసే విధానం కొరింథీ మొదటి పత్రికలో కన్పి

స్తుంది. "కృపావరములు నానా విధములుగా ఉన్నవిగాని ఆత్మ ఒక్కడే. మరియు పరిచర్యలు నానావిధములుగా ఉన్నవి గాని ప్రభువు ఒక్కడే. నానా విధములైన కార్యములు కలవుగాని అందరిలోను అన్నిటిని జరిగించు దేవుడు ఒక్కడే" (కొరింథీ 12 : 4-6).

ఇంకను అనేక సంగతులున్నాయ్. వాటిని యిక్కడ చర్చించ బూనుకొనలేదు. అయితే ఇంతవరకు పరిశుద్ధాత్మ ఎవరు? ప్రభువైన క్రీస్తుకు ఆయనకు గల సంబంధ మేమి ? దేవత్వంలో పరిశుద్ధాత్మ యొక్క స్థానమేమి? అనే కొన్ని విషయాలను కుప్తంగా చూచాము ఇకపోతే పరిశుద్ధాత్మ యొక్క పనిని గూర్చి కొంతవరకు ఆలోచన చేద్దాం. అందులో ప్రాముఖ్యముగా భూమిమీదికి వచ్చిన పరిశుద్ధాత్మకు ప్రభువైన క్రీస్తుయొక్క అపొస్తలులకు కలిగే సంబంధమేమి? పరిశుద్ధాత్మ బాప్తిస్మము యొక్క పరిధి ఏమి?. పరిశుద్ధాత్మ వరములు లేక కృపావరములనే వాటికి దేవుని సంకల్పంలోగల స్థానమేమి ? "పరిశుద్ధాత్మ అనువరం" ఎవరికి ? దానిని గూర్చిన వివరాలేమి ? నేడు పరిశుద్ధాత్మ ఎలా పనిచేస్తున్నాడు ? లేక దేవుని ప్రజలకు ఎలా సహాయ పడుతున్నాడు? పరిశుద్ధాత్మ యెడల నేటి మన బాధ్యత ఏమి ? అనే విషయాలను కూడా క్లుప్తముగా చర్చించుకొందాం :—

[సశేషం

— G. దేవదానం, మద్రాసు-12.

---

## ఆలోచించు
## (THINK)

"దేహము జారత్వము నిమిత్తముకాదు గాని, ప్రభువు నిమిత్తమే; ప్రభువు దేహము నిమిత్తమే, దేవుడు ప్రభువును లేపెను. మనలను కూడ తన శక్తివలన లేపెను. మీ దేహములు క్రీస్తునకు

అవయవములై యున్నవని మీరెరుగరా? నేను క్రీస్తుయొక్క అవయవములను తీసికొని వేశ్యయొక్క అవయవములుగా చేయుదునా? అదెంత మాత్రము తగదు. వేశ్యతో కలిసికొనువాడు దానితో ఏక దేహమైయున్నాడని మీరెరుగరా? వారిద్దరు ఏకశరీరమై యుందురు అని మోషే చెప్పుచున్నాడు గదా? అటువలె ప్రభువుతో కలిసికొనువాడు ఆయనలో ఏకాత్మయై యున్నాడు. జారత్వమునకు దూరముగా పారిపోవుడి. మనుష్యుడు చేయు ప్రతిపాపమును దేహమునకు వెలుపల ఉన్నది గాని జారత్వము చేయువాడు తన సొంత శరీరమునకు హానికరముగా పాపము చేయుచున్నాడు. మీ దేహము దేవునివలన మీకు అనుగ్రహింపబడి, మీలో నున్న పరిశుద్ధాత్మకు ఆలయమైయున్నదని మీరెరుగరా? మీరు మీ సొత్తుకారు. విలువ పెట్టి కొనబడిన వారు. గనుక మీ దేహముతో దేవుని మహిమ పరచుడి" 1 కొరింథీ 6 : 13-20.

## దేవునికి హేయమైనది

నేటి లోకము అనేక ఆకర్షణల మరియు ప్రలోభముల వైపు పయనించుచున్నది. వాటివలన కలుగు దుష్పరిణామాలను లక్ష్యపెట్టక అనేక బాధలకు వ్యాధులకు గురియగుచున్నది. జారత్వము వలన కలుగు పరిణామములు తీవ్రమైనవి. వ్యభిచారము కొన్నిసార్లు ప్రాణాంతకము పాతనిబంధన కాలములో దేవుడు విగ్రహారాధనను ఆత్మీయ వ్యభిచారముగా తలంచెను. బైబిలు గ్రంథమంతటిలో దేవుడు అసహ్యించుకొనిన ముఖ్యమైన పాపములు 1. విగ్రహారాధన 2. వ్యభిచారము.

దేవుడు మోషేకిచ్చిన 10 ఆజ్ఞలలో "వ్యభిచరించకూడదు" అను ఆజ్ఞ ఉన్నది. క్రొత్తనిబంధన కాలములో ఈ ఆజ్ఞ మరింత ఖచ్చితముగ వ్రాయబడెను. యేసు ప్రభువు చెప్పిన మాట వినండి

"వ్యభిచారము చేయవద్దని చెప్పబడిన మాట మీరు విన్నారు గదా, నేను మీతో చెప్పునదేమనగా - ఒక స్త్రీని మోహపు చూపుతో చూచు ప్రతివాడు అప్పుడే తన హృదయమందు ఆమెతో వ్యభిచారము చేసినవాడగును" మత్తయి 5:27-28. ఈ పాపమును ప్రాథమిక స్థాయిలోనే త్రుంచి పారవేయగల ఆజ్ఞలు క్రొత్తనిబంధనలో క్రీస్తు ప్రభువు మనకిచ్చెను. పౌలు యిట్లు చెప్పెను. "కావున భూమిమీద నున్న మీ అవయవములను, అనగా జారత్వమును, అపవిత్రతను, కామాతురతను, దురాశను, విగ్రహారాధనయైన ధనాపేక్షను చంపి వేయుడి" (కొలస్స 3 : 5).

"శరీరము బలహీనమని" క్రీస్తు పేతురుతో చెప్పెను. బలహీనమైన శరీరమును అదుపుచేసికొనుటకు క్రైస్తవుడు సాధనచేయవలసి యున్నది. పౌలు ఈ విషయమునే ప్రస్తావించెను. "ఒకవేళ ఇతరులకు ప్రకటించిన తరువాత నేనే భ్రష్టుడనై పోదునేమో అని నాశరీరమును నలగగొట్టి దానిని లోపరచుకొనుచున్నాను" 1 కొరింథీ 9:27. మానవుడు ఆకర్షణకు గురికాకుండ దానిని అధిగమించి ఆత్మీయ జీవితము నందుకొనసాగవలెననునది దేవుని చిత్తము. ఆకర్షణకు గురికాకుండ ఉండుట కష్టమని దేవుని శక్తిని తన జీవితంలో ఎరిగిన దావీదు పాపము చేసెనని మనము భావిస్తే క్రైస్తవ జీవితానికి సార్థకత చేకూరదు. క్రైస్తవ జీవితము అపవాదితో పోరాటము. ఈ పోరాటాన్ని నేను పోరాడలేనంటే అపవాది నిన్ను జయిస్తుంది. ఇక మిగిలేది ఏడ్పును, పండ్లుకొరుకుటయు మాత్రమే. ఇదే క్రైస్తవ జీవితంలో క్రైస్తవులకు ఎదురయ్యే సవాలు. వాక్యధ్యానము, ప్రార్థన నీ ఆయుధాలు. సొలొమోను వ్రాసిన సామెతలను మనం ధ్యానిస్తే యిందు మనకు ఒక పరిష్కారం దొరుకుతుందని భావిస్తున్నాను.

# జ్ఞానోపదేశము

"నా కుమారుడా, నా జ్ఞానోపదేశము ఆలకింపుము. వివేకముగల నా బోధకు చెవి యొగ్గుము. అప్పుడు నీవు బుద్ధికలిగి నడుచుకొందువు. తెలివినిబట్టి నీ పెదవులు మాటలాడును. జారస్త్రీ పెదవుల నుండి తేనె కారును. దాని నోటి మాటలు నూనెకంటెను నునుపైనవి. దానివలన కలుగు ఫలితము ముసిణిపండంత చేదు. అది రెండంచులుగల కత్తియంత పదునుగలది. దాని నడతలు మరణమునకు దిగుటకు దారితీయును. దాని అడుగులు పాతాళమునకు చక్కగా చేరును. అది జీవమార్గమును ఏమాత్రమును విచారింపదు. దానికి తెలియకుండానే దాని పాదములు ఇటు అటు తిరుగును. కుమారులారా, నా మాట ఆలకింపుడి. నేను చెప్పు ఉపదేశమునుండి తొలగకుడి. జారస్త్రీయుండు ఛాయకు పోక నీ మార్గము దానికి దూరముగా చేసికొనుము. దాని యింటి వాకిటి దగ్గరకు వెళ్ళకుము. వెళ్ళినయెడల పరులకు నీ యౌవన బలమును క్రూరులకు నీ జీవితకాలమును ఇచ్చివేతువు. నీ ఆస్థివలన పరులు తృప్తి పొందుదురు. నీ కష్టార్జితము అన్యుల యిళ్లు చేరును. తుదకు నీ మాంసమును నీ శరీరమును క్షీణించినప్పుడు అయ్యో, ఉపదేశము నేనేల త్రోసివేసితిని? నా హృదయము గద్దింపు నేల తృణీకరించెను? నా బోధకులమాట నేను వినకపోతిని. నా ఉపదేశకులకు నేను చెవి యొగ్గలేదు. నేను సమాజ సంఘముల మధ్యనుండి నన్ను ప్రతి విధమైన దౌర్భాగ్యమునకు లోబడుటకు కొంచెమే యెడమాయెను అని నీవు చెప్పుకొనుచు మూలుగుచుందువు. నీ సొంత కుండలోని నీళ్లు పానము చేయుము. నీ సొంత బావిలో ఉబుకు జలము త్రాగుము. నీ ఊటలు బయటికి చెదరిపోదగునా? వీధులలో అవి నీటి కాలువగా పారదగునా? అన్యులు నీతో కూడ వాటి ననుభవింపకుండ, అవి నీకే యుండవలెనుగదా. నీ ఊట దీవెననొందును. నీ యౌవన

కాలపు భార్యయందు సంతోషించుము. ఆమె అతి ప్రియమైన స్త్రీ" (సామెతలు 6:1-18).

## నేర్చుకోదగిన పాఠాలు

జారత్వమునకు దూరముగా పారిపోయిన యోసేపు మనకు ఆదర్శము. వేశ్యాసాంగత్యమునకు అలవాటు పడిన మహా పరాక్రమశాలి (దేవునికి నాజీరు చేయబడినవాడై ఫిలిష్తీయుల చేతిలోనుండి ఇశ్రాయేలీయులను రక్షింప మొదలుపెట్టిన) సమ్సోను ఏమయ్యెను? ఫిలిష్తీయులు అతని కన్నులను ఊడదీసి ఇత్తడి సంకెళ్ళతో బంధించిరి. అతడు పరిహాసమునకు గురి అయ్యెను. ఈ దుష్పరిణామా లన్నిటికీ కారణము అతడు దెలీలా అను ఒక జారస్త్రీని మోహించుటయే. శత్రువులు అతనిమీదికి ఆమెను ఒక ఆయుధముగా వాడుకొనిరి. ఆమె లాలనచేసి అతనిని శత్రువుల కప్పగించెను.

నైతిక విలువలు పతన మౌతున్న దినాలలో మనం జీవిస్తున్నాము. శోధన ఒక వాస్తవం. దీనిని మనం లేకుండ చేయలేము. యేసు క్రీస్తును శోధించిన అపవాది మనలను శోధించుచున్నది. అయితే వాక్యముతో ఆయన దానిని సమర్థవంతముగా ఎదుర్కొనెను. ఇది ఆయన మనకు చూపిన మార్గము. మనం శోధింపబడడం వాస్తవం. అపవాది మనలను శోధింపకుండ మనము నిరోధించలేము. అయితే శోధనకు గురికాకుండ నుండుటయే మన బాధ్యత. శోధనను ఎదిరించుటకు నాలుగు విషయాల్ని మీకు చెప్పదలిచాను:

1. పాపులను చూచి నీ హృదయమందు మత్సరపడకుము. సామె 3 : 31, 24: 23 ; 17. పాపము స్వాతంత్ర్యము కాదని జ్ఞాపకముంచుకొనుము.

2. నీ స్నేహితులెవరో గమనించుకొనుము. సామె 27 : 17. "ఇనుముచేత ఇనుము పదునగును".

3. వాక్యమును బట్టి నడువుము. కీర్త 119:11. బైబిలు పఠనము శోధన జయించే మార్గము.

4. పాపమునకు దూరముగా నుండుము. 1 కొరింథీ 10 : 13. ఆలోచించుము. విజయము నీదే.

—E.K.V. ప్రసాదరావు, చెయ్యేరు.

---

## బైబిలు దగ్గరకు తిరిగిరమ్ము

దేవుని చిత్తమును తెలియజేయు దేవుని వాక్యమే బైబిలు. దేవుని వాక్యము విని ఆప్రకారము నడుచుకొనువారు దేవుని ప్రేమించేవారు (యోహా 14 : 21, 29). మనము దేవుని ఎంతగ ప్రేమించుచున్నామో దీనివలన తెలియును. బైబిలు దగ్గరకు తిరిగి రమ్మని పిలిచినప్పుడు, మేము బైబిలునకు దూరముగ ఉన్నామా? ఏవిధముగ మేము బైబిలునకు దూరముగ ఉన్నాము? అను ప్రశ్నలు మనలో ఏర్పడవచ్చును.

మానవులు ఎల్లప్పుడు దేవుని మాటలను విడిచిపెట్టి తమ సొంత ఇష్టమును అనుసరించుచున్నారని బైబిలు చరిత్ర చెప్పుచున్నది. మరియు తమ యిష్టమును నెరవేర్చుకొనుటకు దేవుని మాటను విడిచిపెట్టు వారిని దేవుడు యిష్టపడుట లేదనియు, అట్టి వారినిబట్టి దేవుడు సంతోషించుట లేదనియు బైబిలు చరిత్రే చెప్పుచున్నది. దేవుని వాక్యము నుండి కొన్ని సంఘటనలను పరిశీలించుదము.

## స్వేచ్ఛారాధన వ్యర్థము

కయీను హేబెలు ఇద్దరు దేవునికి అర్పణలు అర్పించిరి. దేవుడు హేబెలు అర్పణను అంగీకరించెననియు కయీను అర్పణను అంగీకరించలేదనియు బైబిలు చెప్పుచున్నది. దేవుడు హేబెలు అర్పణను ఎందుకు అంగీకరించెను? కయీను అర్పణను ఎందుకు అంగీకరించలేదు? ఒక్క క్షణము ఆలోచించుము. మన సమాధానము లెన్నియున్నను, "విశ్వాసమును బట్టి హేబెలు కయీను కంటె శ్రేష్ఠమైన బలి దేవునికి అర్పించె"నని బైబిలు చెప్పుచున్నది (హెబ్రీ 11 : 4). హేబెలు యొక్క అర్పణ శ్రేష్ఠమైన దెట్లాయెను? విశ్వాసమును బట్టి అనగా దేవుడు చెప్పిన మాట ప్రకారము హేబెలు బలి అర్పించెను. ఎట్లనగా వినుటవలన విశ్వాసము కలుగును. వినుట దేవుని మాటలవలన కలుగును (రోమా 10 : 17). కయీను విశ్వాసమును బట్టి అర్పించలేదు. అనగా దేవుడు చెప్పినట్లు అర్పించలేదు, కాబట్టి దేవుడు కయీను అర్పణను అంగీకరించలేదు. "ఏలయనగా తాను సెలవిచ్చిన ఆజ్ఞను గైకొనుటవలన యెహోవా సంతోషించునట్లు ఒకడు దహనబలులను అర్పించుటవలన యెహోవా సంతోషించునా? ఆలోచించుము, బలులు అర్పించుటకంటె ఆజ్ఞ గైకొనుటయు పొట్టేళ్ళ క్రొవ్వు అర్పించుట కంటె మాట వినుటయు శ్రేష్టము" అని (1 సమూయేలు 15 : 22). సౌలు దేవుని చిత్త ప్రకారముగా కాక తన సొంత ఇష్టము చొప్పున ప్రవర్తించినప్పుడు తనతో దేవుడు చెప్పెను. సోదరుడా! సోదరీ! దేవుని ఆజ్ఞను విడచిపెట్టి మన యిష్టాను సారముగ దేవునికి మనమేమి చేసినను దేవుడు సంతోషింపడు. దేవుని ఆజ్ఞ ఎంత చిన్నదైనను, తేలికైనదైనను ఆయన ఇచ్చిన ఆజ్ఞను మనము నెరవేర్చినచో యెహోవా సంతోషించునని గ్రహింపవలెను.

## పారంపర్యాచారములు వ్యర్థమే

కయీను వలె ఇశ్రాయేలు జనులు కూడ దేవుని మాటలకు లోబడక తమ పారంపర్యాచారములను గైకొనుటకు దేవుని మాటలను తృణీకరించిరి. మానవులు తమ సొంత జ్ఞానముతో తమ యిష్టానుసారముగా బోధించిన విధులను ఆచారముగ అనుసరించుట పారంపర్యాచారము లనబడును. అట్టి ఆచారములు దేవునివలన కలిగినవి కావని గ్రహింపవలెను. ఇట్టి ఆచారములు దేవునికి యిష్టములేదు. కాబట్టి దేవుడు తన ప్రవక్తయైన యెషయా ద్వారా ఇశ్రాయేలీయులతో ఇట్లనెను. "ఈ ప్రజలు నోటి మాటలతో నాయొద్దకు వచ్చుచున్నారు పెదవులతో నన్ను ఘనపరచుచున్నారుగాని తమ హృదయమును నాకు దూరము చేసికొనియున్నారు. వారు నాయెడల చూపు భయభక్తులు మానవ విధులను బట్టి వారు నేర్చుకొనినవి (యెషయా 29 : 13). వారు దేవుని యెడల చూపు భయభక్తులు దేవుని విధులను బట్టి నేర్చుకొనవలెనా? లేక మానవుల విధులను బట్టి నేర్చుకొనవలెనా? దేవుని విధులను బట్టియేగదా? అయితే ఇశ్రాయేలీయులు మానవుల విధులనుబట్టి దేవుని యెడల భయభక్తులు చూపిరి. కాబట్టి ఆట్టి భక్తి వ్యర్థమైనది. వారి హృదయము దేవునికి దూరమైనది. దేవుని యెడల మనకున్న భయభక్తులు మానవుల విధులనుబట్టి నేర్చుకొన్నవైతే అట్టి భయభక్తులు వ్యర్థము (మత్తయి 15:6-9). దేవుడు తన కుమారుడైన క్రీస్తు ద్వారా కూడ హెచ్చరించెను. శాస్త్రులతోను పరిసయ్యులతోను క్రీస్తు మాట్లాడుచు యెషయా ప్రవచనమును వారికి గుర్తు చేసి ఇట్లనెను. "మీరు దేవుని ఆజ్ఞను విడిచిపెట్టి మనుష్యుల పారంపర్యాచారమును గైకొనుచున్నారు. మీ పారంపర్యాచారమును గైకొనుటకు దేవుని ఆజ్ఞలను బొత్తిగా నిరాకరించుదురు" (మార్కు 7 : 15). తమ పారంపర్యాచారములను గైకొనుటకు దేవుని ఆజ్ఞలను బొత్తిగా నిరాకరించిన ఇశ్రాయేలీ

యులవలె నేడు మనము ఏయే విషయములలో దేవుని వాక్యమును విడిచిపెట్టి పారంపర్యాచారములను అనుసరించుచున్నామో ఆలోచించుట మంచిది గదా ?

పారంపర్యాచారములను అనుసరించుటకు దేవుని ఆజ్ఞను విడిచిపెట్టుట ప్రతి యుగములోను మానవుల యొక్క సమస్యగా ఉన్నది. జనులు తమ పారంపర్యాచారములను అనుసరించుటకు దేవుని ఆజ్ఞలను విడిచిపెట్టుచున్నారు. ఎందువలన ? దేవుని వాక్యము కంటె తమ పారంపర్యాచారముల యెడల ఎక్కువ ఆసక్తి కలిగియున్నారు. దేవునికంటె పారంపర్యాచారములను ఎక్కువగ ప్రేమించుచున్నారు. తమ పారంపర్యాచారములను గైకొనుటకు, దేవుని ఆజ్ఞను విడిచిపెట్టువారు దేవునికి యిష్టులని చెప్పగలమా? ఎన్నటికిని యిష్టులు కారు. కాని జనులు దేవుని వాక్యమును విడిచిపెట్టి మానవకల్పిత బోధలవైపు వెళ్లుచున్నారు. ఇట్టి ప్రయత్నము దేవుని సంతోషపెట్టదనియు, వ్యర్థమనియు గ్రహింపవలెను.

## దేవుని మాటే ప్రయోజనకరం

దేవుడు ఎవ్వరైననూ ఏదైనను బోధించిన యెడల మానవులు దానిని నమ్మవలెనని, అనుసరింపవలెనని దేవుడు కోరుచున్నాడు. మానవులు అనుసరింపవలెసినట్లు దేవుని చిత్తమును దేవుడే గ్రంధరూపమున బయలుపరచెను. ఆ గ్రంధమే బైబిలు (II పేతురు 1:21; 1 కొరింధి 2: 13; II థెస్స 2:15). దేవుని వాక్యమును జనులు నమ్మి ఆ ప్రకారము నడువవలెను. అయితే ఇశ్రాయేలీయులలో సద్దూకయ్యులు అను ఒక తెగవారు ఉన్నారు. పునరుత్థానమును గూర్చి దేవుని వాక్యము బోధించుచున్నది గాని సద్దూకయ్యులు పునరుత్థానమును నమ్మరు. పునరుత్థానము లేదని వారి వాదన. వారు

తమ వాదమును రుజువు చేసికొనుటకు పునరుత్థానమును గూర్చి క్రీస్తును ప్రశ్నించారు (మత్తయి 22:23-33). అయితే దేవుని వాక్యమందు వ్రాయబడిన పునరుత్థానమును వారు నమ్మవలెననియు దేవుని వాక్యమును అర్థము చేసుకొనుటలో పొరబడకూడదనియు క్రీస్తు వారికి బోధించెను.

సద్దూకయ్యులు దేవుని ప్రజలని పిలువబడినను, వారు దేవుని వాక్యమును కొన్ని విషయములలో విశ్వసింపలేదు, అంగీకరింపనూ లేదు. తమ జ్ఞానము ననుసరించి దేవుని వాక్యమును తృణీకరించిరి. అట్టివారి విషయములో దేవుడు సంతోషించునా? ఆలోచించుము. సద్దూకయ్యులవలె నేడు మనమును దేవుని ప్రజలమని పిలువబడినను దేవుని వాక్యమును అనుసరింపక విడిచిపెట్టి అనేకమైన అసత్యబోధలను అనుసరించి బైబిలు దగ్గరనుండి దూరముగ వెళ్ళుచున్నాము. అట్టిది దేవుని సంతోషపరచునా? మానవకల్పిత బోధలను, పారంపర్యాచారములను వెంబడించుచూ మనమును, దేవుని ఇష్టులము కాజాలము. దేవుని సంతోషపరచలేము. దేవుని సంతోషపరచునట్లు మనము మానవకల్పిత బోధలను పారంపర్యాచారములను విడిచిపెట్టి దేవుని ప్రేమించి దేవుని ఉపదేశములను అనుసరించి నడుచుకొందము. ప్రతి విషయములోను బైబిలు ఏమి బోధించుచున్నదో దానిని తెలుసుకొని, దానినే విశ్వసించి అనుసరించుటకు ప్రయాసపడుదము రండి.

—Ch A. క్రిష్టోఫర్, చిత్తూరు.

---

మీరు, మీ కుటుంబ సభ్యులు, మీ మిత్రులు బైబిలు కరస్పాండెన్సు కోర్సులో చేరండి. ఒక క్రొత్తనిబంధనను ఉచితంగా పొందండి. ఈనాడే మాకు వ్రాయండి :

**SATYA VANI,**

**P.O. Box 80, KAKINAD-533 001.**

# నీవు అంగీకరింపబడితివా ?

[ గత సంచిక తరువాయి ]

## క్రైస్తవునిగా గుర్తింపబడాలి

ఒక క్రైస్తవుడు నిజ క్రైస్తవునిగా గుర్తింపబడుట ఎంతో అవసరం. అనగా సమాజంలో క్రైస్తవునిగా గుర్తింపబడుటకు ఒక బంగారు సిలువను మెడలో గొలుసుకు తగిలించుకొనుట కాదు. లేక బొట్టు లేకుండా మసలుట మాత్రము కాదు. బైబిలు పట్టుకు తిరుగుట అంతకంటే కాదు.

**వ్యక్తిగతం :** ప్రతి క్రైస్తవుడు వ్యక్తిగతంగా నిజమైన క్రైస్తవునివలె గుర్తింపబడాలి. అనగా దేవుని వాక్యమునకు అనుకూలముగా జీవించాలి. పవిత్ర మాదిరి జీవితాన్ని చూపించాలి. పౌలు యిట్లు చెప్పుచున్నాడు. "నీ యౌవనమును బట్టి ఎవ్వడును నిన్ను తృణీకరింప నియ్యకుము గాని, మాటలోను, ప్రవర్తనలోను, ప్రేమలోను, విశ్వాసములోను, పవిత్రతలోను విశ్వాసులకు మాదిరిగా వుండుము" (1 తిమోతి 4:11, 12). "అందుచేత సమస్త కల్మషమును, విఱ్ఱవీగుచున్న దుష్టత్వమును మాని, లోపల నాటబడి మీ ఆత్మలను రక్షించుటకు శక్తిగల వాక్యమును సాత్వికముతో అంగీకరించుడి. మీరు వినువారు మాత్రమై యుండి మిమ్మును మీరు మోసపుచ్చుకొనకుండ, వాక్యప్రకారము ప్రవర్తించు వారునై యుండుడి" (యాకోబు 1:21, 22).

"యౌవనులు దేనిచేత తమ నడత శుద్ధిపరచుకొందురు? నీ వాక్యమును బట్టి దానిని జాగ్రత్తగా చూచుకొనుట చేతనే గదా ?" (కీర్తనలు 119 : 9).

సాంఘికం :– ఇది క్రైస్తవ సంఘీ భావమును గూర్చి అనగా క్రైస్తవ సమాజమును గూర్చినది. సంఘం దేవుని దృష్టికి యోగ్యమైనదిగా అంగీకరింపబడాలి. ఇట్టి యోగ్యతను, దేవునికి అంగీకారమైన రీతిని పరిశుద్ధాత్ముడు లేఖనములలో సవిస్తరముగా వివరించెను. దానిని ఉన్నది ఉన్నట్లుగా ఆచరించు సంఘమునే ఆయన అంగీకరించునని తలంచవలయును. అది యేమని నసత్య ఆరాధనే— "దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను ఆరాధించవలెను" (యోహాను 4 : 24).

అనగా—

1) ఆత్మతో పాడాలి— (ఎఫెసి 5 : 19) ఆత్మతోను, మనస్సుతోను పాడుదునని పౌలు చెప్పెను (1 కొరింధి 14 : 16).

2) దేవుని వాక్యము బోధించాలి, వినాలి. వినుటవలన విశ్వాసము కలుగును. (రోమా 10 : 17)

వ్యసనములకు దూరమై స్థిరపరచబడుటకు వాక్యము వినాలి. (కీర్తనలు 119 : 28).

పాపము చేయకుండునట్లు వాక్యమును హృదయములో ఉంచుకొనవలయును (కీర్తనలు 119 : 11).

మన అడుగులు జారకుండునట్లు ధర్మశాస్త్రమును మన హృదయములో ఉంచుకోనాలి (కీర్తనలు 37 : 31).

### 3. ప్రార్థన చేయాలి:–

ఆత్మతోను మనస్సుతోను ప్రార్థించాలని పౌలు చెప్పెను (1 కొరింధి 14 : 15).

ఆసక్తితో మనఃపూర్వకముగా ప్రార్థించాలి. ఇది క్రైస్తవుని ఆత్మను బలపరచును (యాకోబు 5 : 16, 17).

## 4. ప్రభురాత్రి భోజనం

విధిగా ఆరాధనలో ప్రభు రాత్రి భోజనాన్ని ఆచరించాలి. ఆయన శరీరానికి రక్తానికి సాదృశ్యరూపమైన రొట్టె ద్రాక్షరసం పుచ్చుకొనాలి. అట్లు చేయుటవలన మన రక్షణకు కారణమైన ఆ సిలువ మరణాన్ని జ్ఞాపకమునకు తెచ్చుకొనుటయే కాక; దీనివలన సంఘపు వెలుపటి వారికి క్రీస్తు మరణాన్ని ప్రకటించు వారమగుదుము. (1 కొరింథి 11 : 23-28). ప్రభువు వలన పొందిన ఈ ఆజ్ఞను ఆచరించుటవలన ఆయన దృష్టికి మనము అంగీకార యోగ్యుల మగుదుము.

## 5. కానుకలు

దేవుడు మనకు చేసిన మేళ్ళకై కృతజ్ఞతా పూర్వకముగా ఆరాధనలో కానుకలను యివ్వవలసిన బాధ్యత ప్రతి క్రైస్తవునికిని గలదు. సిద్ధ మనస్సుతో యివ్వాలి; కలిమి కొలదియే యివ్వవలయును (II కొరింథి 8 : 12). సణుగు కొనక ఉత్సాహముగా యివ్వవలయును (II కొరింథి 9 : 7). ఇటువంటి సత్య ఆరాధనలో ప్రతి క్రైస్తవుడు విధిగా ప్రతి ఆదివారము పాలు పొందాలి. (అ. కార్య. 20 : 7).

## అంగీకరింపబడని వారి అంతిమ గతి

అయోగ్యమైన బోధ అనగా అబద్ధ బోధ చేయు బోధకులు, వారిని ప్రేరేపించేవారు దేవుని దృష్టికి అంగీకార యోగ్యులు కానేరరు, పైగా శాపగ్రస్తులగుదురు. "మేము మీకు ప్రకటించిన సువార్తను గాక మరియొక సువార్తను మేమైనను పరలోకమునుండి వచ్చిన యొక దూతయైనను మీకు ప్రకటించిన యెడల అతడు శాపగ్రస్తుడగునుగాక" (గలతి 1 : 8). అబద్ధ ప్రవక్తలు మోసగించుటకై గొప్ప

సూచక క్రియలు అద్భుతములను చేయుదురు (మత్తయి 24 : 24). అందుకే పౌలు బోధకుడైన తిమోతిని హెచ్చరిస్తూ యోగ్యుడైన పని వానిగాను, సత్య వాక్యమును సరిగా విభజించు వానిగాను ఉండ వలెనని II తిమోతి 2 : 15 లో వ్రాసెను.

దేవునిచే అంగీకరింప బడనివారి అంతిమ తీర్పును గూర్చి బహు కఠినముగా హెచ్చరించెను. "శపింపబడిన వారలారా, నన్ను విడిచి అపవాదికిని, వాని దూతలకును సిద్ధపరచబడిన నిత్యాగ్నిలోనికి పోవుడి" (మత్తయి 25 : 41). అబద్ధికు లందరు అనగా అసత్య వాదు లందరూ అగ్ని గంధకములో పడవేయబడుదురు. (ప్రకటన 21 : 8). ఏలయనగా దేవుడు అంగీకరింపని వారి పేర్లు జీవగ్రంథమందు వ్రాయ బడవు.

"ఎవని పేరైనను జీవగ్రంథమందు వ్రాయబడినట్టు కనబడని యెడల వాడు అగ్ని గుండములో పడవేయబడును" (ప్రకటన 20:15).

కాబట్టి మానవులంతా దేవుని దృష్టికి యోగ్యులై అంగీకరింప బడాలంటే ఆయన విధించిన ఆజ్ఞలన్నిటిని మనఃపూర్వకముగా, అంగీకరించి పాటించుట శ్రేష్టము.

— B. సుధాకర్ కాకినాడ.

---

## సిలువ యొక్క అవసరత

### సిలువ గురుతు

మానవ పాప ప్రాయశ్చిత్త బలిగా యేసు ప్రభువు సిలువపై తన రక్తాన్ని కార్చి మరణించెను. ఆ రక్షకుని త్యాగ దీక్షా చిహ్నమే సిలువ. యేసుక్రీస్తు సిలువయే మానవ చరిత్రను క్రీస్తుకు పూర్వ మనియు, క్రీస్తు శకమనియు రెండు భాగములుగా చేసెను. అది పాపి యైన మానవునికి రక్షణ సిలువ ద్వారా కలుగునన్న సత్యాన్ని తెలియజేయుచున్నది.

## సిలువ యొక్క అవసరత

దేవుడైన యెహోవా తూర్పున ఏదేనులో ఒక తోట వేసి తాను నిర్మించిన ఆదాము హవ్వలను దానిలో నుంచెను (ఆది. కా. 2 : 8). అయితే ఆదాము హవ్వలు సాతాను మాట విని దేవుడు వారికిచ్చిన ఆజ్ఞను మీరి దేవుడు తినవద్దని చెప్పిన మంచి చెడ్డల తెలివి నిచ్చు చెట్ల ఫలములను తినిరి. అందువలన వారి కన్నులు తెరువబడెను. వారు దేవుని ఆజ్ఞను మీరినందున దేవునికి దూరమైరి. దేవుని సహవాసమును పోగొట్టుకొని ఆత్మీయ మరణము పొందిరి. ఆజ్ఞాతి క్రమమే పాపము. పాపము వలన వచ్చు జీతము మరణము (రోమా 6 : 23). ఆదికాండము 3 : 8-24 చూచిన దేవుడు వారికి విధించిన శిక్షను మనము చూడగలము. "ఇట్లుండగా ఒక మనుష్యుని ద్వారా అనగా ఆదాము ద్వారా పాపమును - పాపము ద్వారా మరణమును లోకములో ఏలాగు ప్రవేశించెనో ఆలాగే మనుష్యులందరు పాపము చేసినందున మరణ మందరికిసంప్రాప్తమాయెను" (రోమా 5 : 12). ఏ భేదములేదు అందరు పాపము చేసి దేవుడను గ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు (రోమా 3 : 23).

పాపమనేది దేవునికి విరోధమైనది (కీర్తన 51 : 54). పాపము దేవుని మీద తిరుగుబాటు (యెషయా 63 : 10). పాపము మానవుని దేవుని నుండి ఎడబాటు చేయునది (యెషయా 59 : 1-2). దేవుడు పాపమును అసహ్యించుకొనును. దేవుడు పాపమును చూడలేడు దేవుడు పరిశుద్ధుడు - దేవుడు - న్యాయవంతుడు. దేవుడు పాపమునకు శిక్ష విధించవలెను. దేవుడు న్యాయవంతుడు. గనుక దేవుని ఆజ్ఞను అతిక్రమించిన వారికి దేవుని న్యాయవిధి ప్రకారముగా పాపిని శిక్షించవలెను. పరిశుద్ధుడగు దేవుడు న్యాయ వంతుడగు దేవుడు పాపిని శిక్షించలేకపోతే అది అన్యాయమగును. మానవుడు తన్ను తాను పాపమునుండి రక్షించుకొనలేడు.

అయితే దేవుడు పాపిని నిత్యనాశనమునకు పంపుటకు ఇష్టపడ లేదు. పాపిని రక్షించాలని ఆయన కోరిక, పాపమునకు దేవుడు తప్పక శిక్ష విధించాలి పాపిని రక్షించాలి, ఈ రెండు ఎట్లు సాధ్యపడగలవు ? మానవునికి అసాధ్యమైనది దేవునికి సమస్తము సాధ్యమే.

మానవ పతనమునకు ముందే దేవుడు మానవ రక్షణను గూర్చి తానే ముందుగా సంకల్పించుకొనెను.

## యేసుక్రీస్తు సిలువ ద్వారా రక్షణ సంకల్పము

ఆదికాండము 3:15. హెబ్రీ 10:5. అపో. కార్యములు 2:23 1 పేతురు 1:19-20 ధ్యానము. యోహాను 3:16 ధ్యానము. దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను (యోహాను 3:16). పాప పరిహారము నిమిత్తము దేవుడు తనసొంత కుమారుని పాప శరీరాకారముతో పంపి ఆయన శరీరమందు పాపమునకు శిక్ష విధించెను (రోమా 8:4). దేవుడొక్కడే, దేవునికిని నరులకును మధ్యవర్తి ఒక్కడే; ఆయన క్రీస్తుయేసను నరుడు. ఈయన అందరికొరకు విమోచన క్రయధనముగా తన్ను తానే సమర్పించుకొనెను. (1 తిమోతి 2:5-6). యోహాను 1:36. క్రీస్తుయేసు మానవుని దేవుని యొద్దకు తీసికొని వచ్చుటకు, దేవునికి మానవునికి సమాధానము కలుగజేయుటకు ఉభయులకు మధ్యవర్తిగా వచ్చెను (హెబ్రీ 7:26). మానవ పాపాన్నంతటిని తన మీద వేసికొనెను. దేవుని కోపాన్ని పాప శిక్ష నంతటిని తాను భరించెను. సిలువపై క్రీస్తు ఒక భయంకర నేరస్తుడు అనుభవించవలసిన ఘోరమైన శిక్షను అనుభవించెను.

క్రీస్తు మిమ్మును ప్రేమించి పరిమళ వాసనగా ఉండుటకు మనకొరకు తన్ను తాను దేవునికి అర్పణగాను, బలిగాను అప్పగించు కొనెను — ఎఫెసి 5 : 2.

మనము పాపముల విషయమై చనిపోయి నీతి విషయమై జీవించునట్లు ఆయన తానేతన శరీరమందు మన పాపములను మ్రానుమీద మోసికొనెను (1 పేతురు 2:24). ఎందుకనగా మనమాయన యందు దేవుని నీతి యగునట్లు పాప మెరుగని ఆయనను మనకోసరము పాపముగా చేసెను (2 కొరింథి 5 : 21).

యెహోవా మన యందరి దోషమును అతని మీద మోపెను (యెషయా 53 : 5-6). నాకు బదులుగా క్రీస్తు చేసిన ప్రాయశ్చిత్త బలిని దేవుడు అంగీకరించి నా పాపములను క్షమించి నన్ను రక్షించెను - సిలువయే నా శరణ్యము సిలువ ద్వారా రక్షణ సాధ్యమాయెను.

## క్రీస్తు సిలువ ద్వారా మానవునికి కలుగు ఆశీర్వాదములు

### 1. విమోచనము (Redemption)

దేవుని కృపా మహా దైశ్వర్యమును బట్టి ఆ ప్రియుని యందు ఆయన రక్తమువలన మనకు విమోచనము అనగా మన అపరాధములకు క్షమాపణ మనకు కలిగియున్నది. ఎఫెసి 1 : 7; మత్తయి 20:28 కొల 1:14, 1:19, 1 పేతురు 1:19 చూడుము.

### 2. దేవునితో సహవాసము (Reconeliatiom)

కాబట్టి విశ్వాస మూలముగా నీతిమంతులముగా తీర్చబడి ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా దేవునితో సమాధానము కలిగియుండము (రోమా 5 : 1, 5 : 10.

## 3. రక్షణ (Salvation)

కాబట్టి ఆయన రక్తమువలన ఇప్పుడు నీతిమంతులముగా తీర్చబడి మరింత నిశ్చయముగా ఆయన ద్వారా ఉగ్రత నుండి రక్షించబడుదుము - రోమా 5 : 8-9.

## 4. పవిత్ర పరచబడుట (Sanctification)

ఆయన సమస్త దుర్నీతినుండి మనలను విమోచించి సత్క్రియల యందు శక్తిగల ప్రజలను తనకోసరము పవిత్రపరచుకొని తన సొత్తుగా చేసికొనుటకు తన్ను తానే మనకొరకు అర్పించుకొనెను- తీతు 2 : 19.

## 5. నీతి మంతులుగా తీర్చబడుట (Justification)

కాబట్టి ఆయన రక్తమువలన మనము ఇప్పుడు నీతిమంతులముగా తీర్చబడి మరింత నిశ్చయముగా ఉగ్రతనుండి రక్షించబడుదుము - రోమా 5 : 9.

మానవ రక్షణకొరకు దేవుడు తన కృపతో శిలువను ఏర్పాటు చేసెను. మానవుడు క్రీస్తు శిలువలో కార్చిన రక్తము ద్వారా రక్షించబడును. మానవుని రక్షించుటకు దేవుడు క్రీస్తు యొక్క సిలువపై ఆధారపడినాడు-మానవుడు తన్ను తాను రక్షించుకొనుటకు క్రీస్తు సిలువపై ఆధారపడవలెను.

సిలువ యందే రక్షణ - ఇక ఏ మార్గము ద్వారాను మానవుడు రక్షణ పొందలేడు.

— P. ప్రకాశం, హైదరాబాదు.

—o—

## సంక్షిప్త వార్తలు

1991 జూలై 8వ తేదీనాడు బొంబాయిలో **Bro.** జోసఫ్ జిన్నాగారు గుండెపోటు వలన మరణించారు. బొంబాయి మహా నగరంలో **Bro.** జాషువా గూటంగారితో కలసి మొదట పది సంవత్సరములు, అటు తరువాత 15 సంవత్సరాలు ఆయన క్రీస్తు సంఘానికి నమ్మకమైన పరిచర్య చేసారు. విశిష్టత ఏమిటంటే జోసఫ్‌గారు **B.E.S.T.** కంపెనీలో ఉద్యోగం చేసుకొంటూ, ఏవిధమైన సపోర్టు లేకయే సువార్త సేవ కొనసాగించారు. ఆయన తన యౌవన దశలోనే విడిచి వెళ్ళిన సతీమణికి, ఇద్దరు బిడ్డలకు, బొంబాయిలోని క్రీస్తు సంఘస్థులకు ప్రభువు ఆదరణ దయచేయును గాక !

* * *

1991 జూలై నెల డెల్టా ప్రాంతపు సువార్తికుల సమావేశము 23వ తేదీ మంగళవారం యెంట్రుకోనలో జరిగెను. సోదరులు, యస్. ఏలీయాగారు అధ్యక్షత వహించగా సోదరులు, దేవరపల్లి అబ్రహాము గారి ప్రార్థనతో కూటము ప్రారంభించబడెను.

సోదరులు ఆర్. సమూయేలుగారు (అమలాపురం) 'సువార్త ధ్వజమెత్తి యుద్ధభూమిలో గొప్ప ఆత్మీయ పోరాటము పోరాడవలెనని, అబద్ధ బోధల విషయమై అప్రమత్తముగా నుండవలెనని' హెచ్చరించిరి. సోదరులు పి. యస్. రావ్‌గారు 'అపొస్తలుడైన పౌలును ఆదర్శంగా తీసికొని మనము ప్రభువు సేవలో కొనసాగవలెనని బోధించిరి.' సోదరులు సి. హెచ్. జాన్‌బాబుగారు (మొరిగండ) 'క్రీస్తు సమాధానకర్తయని మనము సమాధానముతో మెలగవలెనని ఏడు విషయములు వివరించిరి.' సోదరులు యస్. రామకృష్ణారావుగారు (గంటి) 'ఐకమత్యమును గూర్చి, ఆత్మీయ ధైర్యమును గూర్చి

వివరించిరి. సోదరులు వి. చిన్నయ్య (కష్టేలి) బోధకుడు అబద్ధ బోధలను ఎదిరించుటకు వాక్యము బాగుగా ఎరిగియుండి తన యోగ్యతను దేవుని ఎదుట కనపరచుకొనవలెనని' చక్కని సూచనల నందించిరి (II తిమోతి 2 : 15). అధ్యక్షులు యన్. ఏలీయాగారు మధ్యలో చక్కని హెచ్చరికల నిచ్చి సమర్థవంతముగ కార్యక్రమమును నడిపించిరి. సుమారు 25 మంది సువార్తికులు ఈ సమావేశమునకు హాజరైరి. సోదరులు సి. హెచ్. రవిరాజు (అంబాజీపేట)గారి ప్రార్థనతో కూటము జయకరముగా ముగిసెను.

సోదరులు జె. సత్యం (వీధివారిలంక) గారు వారి గ్రామము నుండి 12 మందిని ఈ కూటమునకు తీసుకొని వచ్చిరి. వారిలో ఆ దినమున 6 గురు బాప్తిస్మము పొందిరి. ఈ సంవత్సరము జరిగిన 6 సమావేశాలలో యింతవరకు 31 మంది బాప్తిస్మము పొందిరి. దేవుని మహిమార్థమైన గొప్పపని జరుగుచున్నది. రాత్రి కూటములో సోదరులు యన్. ఏలీయాగారు; పి. యన్. హోముగారు దేవుని వాక్యమును అందించిరి.

సోదరులు సి. హెచ్. యేసు దాసుగారు మొంట్రికోన మరియు తూర్పులంక గ్రామాలలో సువార్తను ప్రకటించుచున్నారు.

* * *

జూలై 31 నుండి ఆగష్టు 2 వరకు విశాఖ జిల్లా చోడవరం ఏరియాలో జరిగిన సువార్త కూటాల్లో **Bro.** జాషువా గూటంగారు పాల్గొనిరి. **Bro. M.** ప్రసంగిగారు ఈ ప్రాంతములో చక్కటి సేవను జరిగించుచున్నారు. కూటములలో 7 గురు పెంతెకొస్తువారు బాప్తిస్మము పొంది క్రీస్తు సంఘమునకు చేర్చబడిరి.

ఆగష్టు 8 నుండి 11 వరకు అనకాపల్లివద్ద తుమ్మపాల

గ్రామంలో జరిగిన సువార్త సభలు దిగ్విజయంగా జరిగినవి. ఈ సభలో **Bro. E.K.V.** ప్రసాదరావుగారు, **R.Ch.** సద్గుణరావుగారు తదితర్లు వాక్యోపదేశం చేసిరి. ఈ సభలు **Good Shephered English Medium School** ప్రిన్సిపాల్ **Bro. A.** వినయానంద్ గారి ప్రోత్సాహముతో తుమ్మపాల క్రీస్తు సంఘము వారు జరిపించిరి.

* * *

ఆగష్టు 20వ తేదీనాడు గోదావరి జిల్లా సువార్తికుల సమావేశము కాట్రేనికోన సమీపమున గల సత్తెమ్మ చెట్టు గ్రామమందు జరిగెను. ఈ గ్రామములో హైందవుల మధ్య సోదరులు **E.K.V.** ప్రసాదరావుగారు, **V.V.** రాఘవులుగారి సహకారముతో గొప్ప పనిని జరిగించుచున్నారు.

ఈ చారిత్రాత్మక సమావేశమునకు పలువురు సోదరులు హాజరై, "ఐక్యసాధనకు అవరోధం కలిగించే అంశాలను అధిగమించి ఏకత్వమును సాధించుట ఎట్లు?" అను అంశముపై కూలంకశముగా చర్చను జరిపించిరి. ఆదిలో అనామకులు గత్యంతరము లేక 'సహవాసము' పేరున సంఘాల్లో జొరబడి సహోదరులను ధన, కుల ప్రాతిపదికపై వేరు చేయుచున్న శక్తులను గూర్చి అప్రమత్తంగా యుండాలని కొందరు సోదరులు గ్రహించి హెచ్చరించిరి.

సోదరులు **J.** సత్యంగారు అధ్యక్షత వహించగా, పాకా హెన్రీ గారి ప్రార్థనతో కూటము ప్రారంభమైనది. సత్తెమ్మ చెట్టు గ్రామంలో అందంగా నిర్మించబడిన ప్రార్థనాలయమును **Bro.** పాల్ గూటంగారు రిబ్బను కత్తిరించి ప్రారంభించిరి. సోదరులు **N.** ఏలీయా, **P.S.** రావు, **Ch.** యేసుదాసుగార్లు పాటలు చక్కగా నడిపించగా

సోదరులు E.K.V. ప్రసాదరావు, D. అబ్రాహాము, N. ఏలియా, పాల్ గూడుంగార్లు చక్కటి వాక్యోపదేశం జరిగించిరి. ఈ శుభసందర్భంలో 6 గురు హైందవులు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. సువార్త కూటము ముగియుసరికి అర్థరాత్రి దాటినా దేవుడనుగ్రహించిన చక్కటి వాతావరణాన్ని బట్టి హాజరైన వందలాది గ్రామస్థులు సంఘస్థులు ప్రభువును స్తుతిస్తూ చివరివరకు ఉండి ఆత్మీయానందాన్ని పొందగలిగిరి. ఆనాటి కూటం Bro. S. రామకృష్ణగారి ప్రార్థనతో ముగింపాయెను.

ఆగష్టు నెలలో జరిగిన పుష్కరాలలో పలు ప్రాంతములనుండి వచ్చిన సహోదరులు భద్రాచలం, కొవ్వూరు, రాజమండ్రి, కోటిపల్లి మొదలగు స్థలాలలో ఇంచుమించు పది లక్షల సువార్త పత్రికలను పంచారు. క్రీస్తు సంఘస్థులు ప్రచురించిన పత్రికల ద్వారా సత్య సువార్త లక్షలాది ప్రజలకు అందజేయబడుట ఆనందదాయకం.

* * *

Regd. No. H/KD—45/KD.H.O.

From
SATYA WAKKU
P.O. Box 80
KAKINADA 533 001

No.

To